సాక్షి
సిద్దిపేట
బుధవారం ǀ 26 ǀ జూలై ǀ 2023

కుమ్మేసిన వాన



ఉధృతంగా ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు చెక్‌డ్యాం

జిల్లాలో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మోయతుమ్మెద వాగు ప్రవాహానికి మంగళవారం పోలీసులు వాహన రాకపోకలు నిలిపివేశారు. అలాగే కూరగాయల పంటలు, మొక్కజొన్న, పత్తి పైరుల్లో నీరు చేరి అధిక నష్టం కలిగింది. రైతులు కూడా తమ పంటలు వరద నుంచి కాపాడుకునే ప్రయత్నాలు చేసుకోవాలని, వ్యవసాయ శాఖ కూడా తనవంతుగా సహాయ సహకారాలను అందిస్తోందని అధికారి వెల్లడించారు. జిల్లాలో వెయ్యికి పైగా చెరువులు పూర్తిగా నిండాయి.

- జిల్లాలో దంచికొట్టిన వాన
- పలు మండలాల్లో భారీగా..
- కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు ఉధృతం
- వెయ్యికి పైగా నిండిన చెరువులు, కుంటలు

దుబ్బాకటౌన్: జిల్లాలో వాన దంచికొట్టింది. పలు మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. ఆది, సోమ వారాల్లో కొద్దిగా తెరిపివ్వగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం రోజంతా ఏకదాటిగా వానకురుస్తోంది. జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, దుబ్బాక, బెజ్జంకి మండలాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కుండపోతగా వాన కురియడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. డ్రైనేజీల్లో ఉప్పొంగి రోడ్లపై మోకల్లోతుకు పైగా నీరు ప్రవహించింది. పలు గ్రామాల్లో ఇళ్లల్లోకి చేరిన వరదతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

పొంగిపొర్లుతున్న కూడవెల్లి, మోయతుమ్మెద

భారీ వర్షాలతో జిల్లాలోని ప్రధానమైన కూడవెల్లి, మోయతుమ్మెద మంగళవారం కూడవెల్లి, మోయతుమ్మెద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోనే ప్రధానమైన కూడవెల్లి వాగుపై నిర్మించిన 28 భారీ చెక్‌డ్యాంలు సైతం పూర్తిగా నిండి రాజన్నసిరిసిల్ల జిల్లా నర్మాల వద్ద ఉన్న ఎగువ మానేరులోకి వరద చేరుతోంది. కూడవెల్లి వాగు భూంపల్లి వద్ద ఉన్న చిన్న బ్రిడ్జిని తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. తొగుట మండలం రాంపూర్ వాగుగడ్డ వద్ద బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తోంది.

చెరువులకు జలకళ

చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకున్నాయి. దుబ్బాకలోని రామసముద్రం, ఏదుల్ల చెరువులు, హుస్నాబాద్‌లోని కొత్తచెరువుతోపాటు చాలా గ్రామాల్లో చెరువులు కుంటలు, అలుగులు పోస్తున్నాయి. జిల్లాలో మొత్తం 3,426 చెరువులకుగాను వెయ్యికి పైగా పూర్తిగా నిండి మత్తడి దూకుతున్నాయి.

రాకపోకలు బంద్

కోహెడ మండలం బస్వాపూర్ వద్ద సిద్దిపేట–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైనుంచి మోయతుమ్మెద వాగు ప్రవహిస్తుండడంతో మంగళవారం మళ్లీ పోలీసులు వాహన రాకపోకలు బంద్‌చేశారు. సిద్దిపేట–హన్మకొండ ప్రధానరహదారి కావడంతో ఆ రూట్లలో వచ్చే వాహనాలను వేరే గ్రామాల మీదుగా పంపిస్తున్నారు.



దుబ్బాకలో అలుగుపోస్తున్న రామసముద్రం చెరువు

నీరు లేకుండా చూసుకోవాలి



భారీ వర్షాలతో పంటపొలాల్లోకి వరద చేరితే వెంటనే తొలగించుకోవాలి. భారీ వర్షాలతో జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటల్లో నీరు చేరడంతో మునిగిపోయి నష్టం సంభవించే ప్రమాదాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని నీరు లేకుండా చూసుకోవాలి. చాలా గ్రామాల్లో నాటేసిన వరిపొలాలు వరదతో మునిగిపోయాయి. భారీ వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతులు కూడా తమ పంటలు వరద నుంచి కాపాడుకునే ప్రయత్నాలు చేసుకోవాలి.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పంటలకు నష్టం

కుండపోతగా వాన కురుస్తుండటంతో పెద్దఎత్తున వరదొచ్చి పొలాలు మునిగిపోయాయి. కూరగాయల పంటలు, మొక్కజొన్న, పత్తి పంటల్లో నీరు చేరడంతో అధిక నష్టం ఏర్పడింది. నాటేసిన వరి పొలాలు వరదలో మునిగి ఇసుక మేటలతో చాలా నష్టం ఏర్పడింది. పంట పొలాల్లో వరదతో పెద్ద గండ్లు పడడం, కయ్యలు కోయడంతో వరితోపాటు పలు పంటలు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది. వరదలో మునిగిపోయిన పంటల పరిస్థితి అయోమయంగానే ఉంది.



దుబ్బాకలో వరదనీటిలో పెద్ద ఎత్తున మునిగిపోయిన వరి పొలాలు

హుస్నాబాద్‌లో అత్యధిక వర్షపాతం

హుస్నాబాద్: హుస్నాబాద్ డివిజన్‌లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. హుస్నాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. హుస్నాబాద్‌లోని కొత్త చెరువు, చౌటపల్లి, తోటపల్లిలోని చెరువులు, పందిల్లలోని చెక్ డ్యామ్ మత్తడితో దూకుతున్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు, అక్కన్నపేట మండలంలోని అక్కన్నపేట, రామవరం, అంతకపేట, జనగామ, మల్లంపల్లి చెరువులు నిండుకుండలా మారాయి. జిల్లాలో మొత్తం 26 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా హుస్నాబాద్‌లో 15.6 సెం.మీ, అక్కనపేట మండలంలో 12.2, కోహెడలో 8.3, దుబ్బాకలో 5.7, బెజ్జంకిలో 5.4, మద్దూర్, దూల్‌మిట్టలో 5.8 సెంటీమీటర్.. భారీ వర్షపాతాలు నమోదయ్యాయి. అత్యల్పంగా మిరుదొడ్డిలో 1.7 సెం.మీ కురిసింది. జిల్లా మొత్తంగా 4.4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



నిండుకుండలా మారిన ఎల్లమ్మ చెరువు



హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ చుట్టూ చేరిన వరద



పందిల్లలో మత్తడి పోస్తున్న చెక్‌డ్యామ్

అభివృద్ధిలో గజ్వేల్ ఆదర్శం

మహారాష్ట్ర సర్పంచ్‌ల బృందం ప్రశంస

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్ పాలనలో గజ్వేల్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని, ఇలాంటి పథకాలు దేశమంతా చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహారాష్ట్ర సర్పంచ్‌ల బృందం సభ్యులు కొనియాడారు. మండలంలోని కోమటి బండగుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ ప్రాంతాన్ని, పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌తోపాటు వైకుంఠధామాలను మహారాష్ట్రకు చెందిన సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అనిల్‌పటేల్, సర్పంచ్‌లు అక్షయ్‌పటేల్, టోకిబాయ్, అనురాధహోలేలతో కూడిన సుమారు 100 మంది బృందం సభ్యులు మంగళవారం సందర్శించారు. హెడ్‌వర్క్స్ వద్ద వారికి, డిప్యూటీ ఈఈ నాగార్జున నీటి శుద్ధి, తాగునీటి సరఫరా, పథకం తీరుతెన్నులను వివరించారు. పట్టణంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం క్రయవిక్రయాలపై బృందం సభ్యులకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గుజరాత్‌ను మోడల్‌గా చెబుతున్న అక్కడి ప్రభుత్వం తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని ఒకసారి చూడాలన్నారు. అనంతరం మార్కెట్‌లో పలువురు పండ్లు కొన్నారు.

మల్లన్నసాగర్ సందర్శన

తొగుట(దుబ్బాక): మండలంలోని కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను మహారాష్ట్ర సర్పంచ్‌ల బృందం మంగళవారం సందర్శించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను సర్పంచ్‌లకు ప్రాజెక్టు ఎస్‌ఈ బస్వరాజ్ వివరించారు. గోదావరి జలాలను పంపుల ద్వారా ఎత్తిపోసే విధానాన్ని వారు పరిశీలించారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామ శివారులో 540 ఎంఎల్‌డీ సామర్థ్యంతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మంగళవారం మహారాష్ట్ర సర్పంచ్‌ల బృందం సందర్శించింది.



కోమటిబండలోని మిషన్ భగీరథ హెడ్‌వర్క్స్ పైలాన్ వద్ద మహారాష్ట్ర సర్పంచ్‌ల బృందం

ముగిసిన మారథాన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

సిద్దిపేటజోన్: రాష్ట్రంలో తొలిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాఫ్ మారథాన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. ఆగస్టు 6న చిన్నకోడూరు మండలం రంగనాయక సాగర్ వద్ద హాఫ్ మారథాన్ నిర్వహించనున్నారు. కొన్ని రోజులుగా హాఫ్ మారథాన్ గురించి విస్తృతంగా ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. హాఫ్ మారథాన్ కు మరింత ప్రాచుర్యం కోసం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని క్రీడాకారులలో పరోక్షంగా ఉత్సాహం నింపారు. మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని, రన్నింగ్ అనేది మనిషి దినచర్యగా ఉండాలని మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు

స్వచ్ఛ జిల్లా సాధిద్దాం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: జిల్లాలోని గ్రామాల్లో స్వచ్ఛత పాటించి స్వచ్ఛ జిల్లా సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయంలో విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ తదితర అంశాలపై స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా వ్యవసాయ స్థితిగతులు, రైతుబంధు గురించి ఆమె ఆరా తీశారు. ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ, జిల్లా విద్యాధికారి ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో వైద్యం కోసం తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



సమావేశంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ

గోరువెచ్చని నీటినే తాగాలి: ఎస్‌ఈ

సిద్దిపేట రూరల్/గజ్వేల్‌రూరల్: జిల్లాలోని ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో వరద చేరడంతో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాల ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని మిషన్ భగీరథ సిద్దిపేట సర్కిల్ ఎస్‌ఈ ఒక ప్రకటనలో తెలిపారు. పలు గ్రామాల్లో రంగుమారిన నీరు సరఫరా అవుతోందని మిషన్ భగీరథ పథకం పర్యవేక్షక ఇంజినీర్ రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్ ద్వారా కోమటిబండగుట్టపై గల మిషన్ భగీరథ గజ్వేల్ సెగ్మెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సరఫరా అయ్యే నీరు రంగుమారి ఉంటుందని, దీంతో ఎలాంటి సమస్యలు తలెత్తవని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని పేర్కొన్నారు.

వీఆర్‌ఏల దరహాసం

- ఇక వీరు రెగ్యూలర్ ఉద్యోగులు..
- జిల్లాలో 26 మండలాల్లో 1,071 మంది గ్రామసహాయకులు
- పదో తరగతి వరకు 841, ఇంటర్ 94, డిగ్రీ, ఆపై 136 మంది
- విద్యార్హతల ఆధారంగా ప్రభుత్వం పేస్కేల్, కేటగిరీలు
- జిల్లాలో పలుచోట్ల సీఎం కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

సాక్షి, సిద్దిపేట: కొన్నేళ్లుగా వెట్టిచాకిరీతో మగ్గుతున్న వీఆర్‌ఏ (గ్రామ సహాయకులు)లకు ప్రభుత్వం విముక్తి కల్పించింది. వారికి ఉద్యోగ భద్రత(రెగ్యూలర్) పేస్కేల్ వర్తింప చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీఆర్‌ఏలకు అర్హతల ఆధారంగా వ్యవసాయ, మున్సిపల్, రెవెన్యూ, విద్య, ఇరిగేషన్, పంచాయతీరాజ్, వైద్య శాఖలతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో వీరిని నియమిస్తోంది. జిల్లావ్యాప్తంగా 1,071 మంది వీఆర్‌ఏలున్నారు. వీరిలో 61 ఏళ్లు దాటిన వారు సుమారు 241లకుపైగా ఉన్నారు. వీరి స్థానంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కారుణ్య నియామకాలు చేపట్టనుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా వ్యాప్తంగా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకాలను వీఆర్‌ఏలు నిర్వహిస్తున్నారు.

ఎలాంటి విద్యార్హతలు లేని వారు 472

జిల్లావ్యాప్తంగా 26 మండలాల్లో 1,071 మంది వీఆర్‌ఏలున్నారు. ఇద్దరు వీఆర్‌ఏలు మరణించారు. గతంలో వీరు ప్రధానంగా పొలాలకు సంబంధించి పన్నులు వసూలు చేసేవారు. ప్రభుత్వం రైతులకు సంబంధించిన పన్నులను మాఫీ చేయడంతో వీరికి తహసీల్దార్ కార్యాలయాలల్లో పని చేయడంతో పాటు రెవెన్యూ రికార్డులు భద్రపర్చడంలోనూ వీరే కీలకంగా ఉన్నారు. దశాబ్దాలుగా వీఆర్‌ఏలు పనిచేస్తుండగా వంశపారంపర్యంగా పని చేస్తున్న వారిలో యువకులే అధికంగా ఉన్నారు. జిల్లాలో ఎలాంటి విద్యార్హతలూ లేనివారు 472 మంది ఉన్నారు. పదో తరగతి విద్యార్హత ఉన్న వారికి చివరి గ్రేడ్‌ కేటాయించారు. ఎలాంటి విద్యార్హత లేని వారిని సైతం చివరి గ్రేడ్ పరిధిలోకే తీసుకుంటున్నారు. త్వరలో దీనికి సంబంధించి నియమనిబంధనలు ప్రభుత్వం విడుదల చేయనుంది.

పాతశాఖ అయితే ఇబ్బందులుండవు!

కాగా రెవెన్యూ శాఖలో పోస్టింగ్ కోసం వీఆర్‌ఏలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అయితే పాత శాఖ కాబట్టి ఎలాంటి ఇబ్బందులూ ఉండవని, అదే కొత్త డిపార్ట్‌మెంట్‌కు వెళ్లితే ఆ శాఖలో వివరాలు అర్థం అయ్యేసరికి సమయం తీసుకుంటుందని వీఆర్‌ఏలు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.



గజ్వేల్‌లో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

విద్యార్హతలు	వీఆర్‌ఏ సంఖ్య	కేటగిరి	పేస్కేల్(రూ.)
పదో తరగతి వరకు	841	చివరి గ్రేడు	19,000-58,850
ఇంటర్	94	రికార్డు అసిస్టెంట్లు, తత్సమానం	22,240-67,300
డిగ్రీ ఆపై	136	జూనియర్ అసిస్టెంట్లు,తత్సమానం	24,280-72,850

మా కల నెరవేరింది



కొన్నేళ్లుగా వీఆర్‌ఏల రెగ్యులర్ కోసం ఎదురు చూస్తున్నాం. మాపై సీఎం కేసీఆర్ కరుణ చూపి మమ్మల్ని రెగ్యులర్ చేశారు. మా చిరకాల స్వప్నం నెరవేరింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

–శ్రీశైలం, అధ్యక్షుడు, చిన్న కోడూరు వీఆర్‌ఏ సంఘం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



వీఆర్‌ఏలకు పే స్కేల్ తో పాటు విధులు కేటాయించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం. మాకు ఒక భరోసా ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు.

–రవీందర్, జిల్లా అధ్యక్షుడు, వీఆర్‌ఏల సంఘం

ప్రతి మొక్కనూ సంరక్షించాలి

అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

తొగుట(దుబ్బాక): నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. మల్లన్నసాగర్ (వేములఘాట్ శివారు) సమీపంలో తెలంగాణ సంపద వనాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాటిన మొక్కలను పరిశీలించారు. వాటి సంరక్షణ కోసం చుట్టూ కందకం తీసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్‌కు ఏపీవో కిషన్ పై చందాపూర్ సర్పంచ్ నర్సింలు ఫిర్యాదు చేశారు. మండలంలోని పలువురు సర్పంచ్‌ల సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. తన విధులు పక్కనబెట్టి ఎంపీడీవో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చంద్రమోహన్‌రెడ్డి, డీపీవో దేవకిదేవి పాల్గొన్నారు.

పరిశీలన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామ పంచాయతీ నిర్వహణ తీరును మంగళవారం అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ పరిశీలించారు. ఆపై పంచాయతీ రికార్డునూ పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ తీరు ఎలా ఉందో పంచాయతీ కార్యదర్శి రమ్యను అడిగి తెలుసుకున్నారు. 5 ఏళ్లు దాటిన పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేసే క్రమంలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు గాను ఇక్కడికొచ్చారు. కాగా కుకునూరుపల్లి నుంచి కలకలమ్మచెరువు కట్టపై నుంచి బొబ్బాయిపల్లికి వచ్చే రోడ్డు వర్షాలకు దెబ్బతినడంతో ప్రయాణానికి ఆటంకంగా మారిన విషయాన్ని సర్పంచ్ కోల శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.



తొగుటలో తెలంగాణ సంపద వనాలను పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్

న్యూస్‌రీల్

సత్ఫలితాల మిషన్ కాకతీయ



పెద్దచెరువును పరిశీలిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి

దుబ్బాక: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం సత్ఫలితాలిస్తున్నాయని మెదక్ పార్లమెంట్ సభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పెద్దచెరువును పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండుకుండల్లా మారాయన్నారు. జిల్లాలో నిండుకుండల్లా దర్శనమిస్తున్న చెరువులను చూసి తన మనస్సు ఉప్పొంగుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కాగా, 12వ వార్డుకు చెందిన బండి రాజయ్య ఇటీవల చెరువులో పడి మృతి చెందగా, అతడి కుటుంబాన్ని, అనారోగ్యంతో మరణించిన కండక్టర్ నీరజ కుటుంబాన్నీ పరామర్శించారు.

శిక్షలతో నేరాలు తగ్గుముఖం



మాట్లాడుతున్న సీపీ శ్వేత, పక్కన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: నిందితులకు కేసుల్లో శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పడతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో లాంగ్ పెండింగ్‌ని నాన్ బెయిలబుల్ వారెంట్, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి ఏసీపీలు, సర్కిల్ సీఐలు, కోర్టు డ్యూటీ సిబ్బందితో మంగళవారం సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నాన్ బెయిలబుల్ వారెంట్స్.. వారం, పది రోజుల్లో ఎగ్జిక్యూట్ చేయాలన్నారు. కోర్టు ట్రయల్ త్వరగా జరిపించాలని సూచించారు. పోక్సో, సైబర్ నేరాలలో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కేసులపై డివిజన్‌లవారీగా ఏసీపీలు రివ్యూ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్, సీఐలు రవికుమార్, భానుప్రకాష్, కృష్ణారెడ్డి, చేరాలు, కృష్ణ, కమలాకర్, జాన్‌రెడ్డి, జానకీరామ్‌రెడ్డి, కిరణ్, సత్యనారాయణ, కోర్టు లైజనింగ్ అధికారి రాజమల్లు, సిసిఆర్‌సి సిబ్బంది, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీడీని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న అమర్‌సింగ్‌నాయక్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లాలో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎండీడీ) కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర మలేరియా అదనపు డైరెక్టర్ డాక్టర్ అమర్‌సింగ్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు ఎండీడీ కార్యక్రమంపై వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో అమర్‌సింగ్‌నాయక్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ, ఎండీడీలో భాగంగా జిల్లాలో ఆగస్టు 10 నుంచి 25వ తేదీ వరకు 2 సంవత్సరాల పైబడిన వారికి డీఈసీ, అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. మూడు విడతలుగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పుల్లూరు, నారాయణరావుపేట, అంబేద్కర్ నగర్, దౌల్తాబాద్, రాయపోల్, జగదేవ్‌పూర్, తీగుల్, తొగుట, అమ్మాదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 2 లక్షల 93వేల మందికి ఎండీడీలో భాగంగా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, రాష్ట్ర ప్రోగ్రాం కన్సల్టెంట్ సైదులు పాల్గొన్నారు.

28న డెమోకు రండి

చేర్యాల(సిద్దిపేట): సిద్దిపేట జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ నియామకాలు చేపడుతుండగా, ఈనెల 28న మిట్టపల్లిలో జరిగే డెమోకు అభ్యర్థులు హాజరు కావాలని జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌బాబు మంగళవారం తెలిపారు. చేర్యాల పీజీటీ ఇంగ్లీష్, కోహెడ, చిన్నకోడూరు జేఎల్ ఇంగ్లీష్, వర్గల్ పీజీటీ మ్యాథ్స్, కొండపాక జేఎల్ ఇంగ్లీష్, హుస్నాబాద్ బెజ్జంకి జేఎల్ మ్యాథ్స్ సబ్జెక్టుకు.. డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా, జైలు

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానాతో పాటు ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వారం రోజుల నుంచి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రమేష్ బాబు ఎదుట మంగళవారం హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 13 మందికి రూ.28వేలు జరిమానా, వారిలో ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష విదించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



గేదె కళేబరం

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి గ్రామానికి చెందిన జొన్నగడ్డల రాజుకు చెందిన పాడి గేదెను మంగళవారం మేతకు తీసుకెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రాజు గేదె మరణించడంతో రూ.70వేల వరకు నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ శాఖ అధికారులు ఆర్థిక సాయం అందజేసి రైతును ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.30వేలు అపహరణ



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాల గ్రామంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన విశల బోయిన లింగమ్మ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. తిరిగొచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించింది. వెంటనే ఇంట్లో వెళ్లి చూసింది. బీరువాలో ఉన్న రూ.30వేలు ఎత్తుకెళ్లారని పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి విచారణ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ఇబ్రహీం మృతదేహం

రామాయంపేట(మెదక్): పంటకు నీరు పారించడానికి వెళ్లిన యువరైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం..రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం(26) రెండెకరాలపొలంలో వరి వేశాడు. ఈ క్రమంలో వరి చేనుకు నీరు పారించడానికి మంగళవారం సాయంత్రం బోరువద్దకు వెళ్లి స్టార్టర్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య మంతాజ్, తల్లి ఉన్నారు. తల్లి షేక్ అమీనా ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నాని పేర్కొన్నారు.

వానొస్తే.. నరకమే..!

మోడల్ మున్సిపాలిటీగా చెప్పుకుంటున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ వానొస్తే వణికిపోతుంది. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. వరద నీరు సక్రమంగా వెళ్లక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లకు ఇటీవల రూ.120కోట్ల ప్రతిపాదనలు పంపితే కేవలం 20శాతం నిధులు మంజూరు చేశారు. దీంతో పట్టణ అవసరాలకు 25శాతం మాత్రమే నిర్మాణ పనులు జరగడంతో ఈ దుస్థితి నెలకొంది. వరద కాల్వల నిర్మాణానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదించిన రూ.15కోట్ల వ్యవహారం కూడా కొలిక్కిరాలేదు. ఫలితంగా పట్టణ ప్రజలకు ఏళ్లతరబడి ఇక్కట్లు తప్పడం లేదు.
ఈ వ్యవహారంపై కథనం..



గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రోడ్డు

- వరద కష్టాలు యథాతథం
- అంతర్గత రోడ్లు ఛిద్రం
- రూ.120కోట్ల ప్రతిపాదనలకు రూ.22.87కోట్లు మంజూరు
- వరద కాల్వల పనులు పెండింగ్‌లోనే..

ప్రజల ఇబ్బందులు తీరుస్తాం



మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల ఇబ్బందులు తీర్చడానికి కృషి చేస్తాం. 20వార్డుల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.120కోట్లకుపైగా ప్రతిపాదనలు పంపింది నిజమే. కానీ రూ.22.87కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. వరద కాల్వలకు సంబంధించిన రూ.15కోట్ల ప్రతిపాదనలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం. – గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి

గజ్వేల్: భారీ వర్షాలొస్తే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రత్యేకించి అంతర్గత రోడ్లలో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో కొన్ని చోట్ల మినహా చాలావరకు కాలనీల్లోని రోడ్లు గుంతలమయంగా మారాయి. తొలుత మిషన్ భగీరథ పనులు, ఆ తర్వాత యూజీడీ పనులు చేపట్టడంతో రోడ్లు మరింతగా ధ్వంసమయ్యాయి. దీంతో మున్సిపాలిటీ పరిధిలో సుమారుగా 80కిలోమీటర్ల పొడవునా సీసీ రోడ్లకు రూ.120 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదిస్తే ఇందులో కేవలం రూ. 22.87కోట్లను మాత్రమే ప్రభుత్వం విడదల చేసింది. ఫలితంగా 18కిలోమీటర్ల మేర మాత్రమే పనులు చేపడుతున్నారు. మిగితా చోట్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీ, భారత్‌నగర్, క్యాసారం, ముట్రాజ్‌పల్లి, ప్రజ్ఞాపూర్‌లోని పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయి. ఇకపోతే గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రహదారికి సైతం ఏటా వరదముప్పు తప్పడం లేదు. ప్రధానంగా ప్రజ్ఞాపూర్ ఊరచెరువు మత్తడి దుంకితే ఆ నీరు వెళ్లడానికి అవసరమైన నాలాల వ్యవస్థ లేదు. నిజానికి ఈ వరద నీరు నాలాల ద్వారా రాజిరెడ్డిపల్లి కుంటలోకి అక్కడి నుంచి క్యాసారం చెరువులోకి వెళ్లాల్సి ఉంటుంది. కానీ నీరు వెళ్లే మార్గం లేక అక్కడి నుంచి ఇళ్ల మధ్యకు చేరుతుంది. అదేవిధంగా ఎర్రకుంట నుంచి పాండవుల చెరువు ఫీడర్ చానెల్ నిర్మాణానికి మరో రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రెండు ప్రతిపాదనలకు ఆమోదం వస్తేనే పట్టణంలో వరద ముప్పునకు పరిష్కారం లభిస్తుంది. కానీ ప్రతిపాదనలకు ఏళ్లతరబడి మోక్షం లేకపోవడంతోనే ఏటా వరద కష్టాలు పరిపాటిగా మారాయి.

కూలిన ఇల్లు

- తృటిలో తప్పిన ప్రమాదం



కూలిన ఇల్లు

రామాయంపేట(మెదక్): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నార్సింగి మండలం నర్సంపల్లిలో మంగళవారం తెల్లవారుజామున మహమ్మద్ పాషా ఇల్లు కూలిపోయింది. అదృష్టవశాత్తు వారు పడుకున్న గది కూలలేదు. పక్కగది పైకప్పు కూలడంతో పెను ప్రమాదం తప్పిందని వారు వాపోయారు.దీంతో తనను ఆదుకోవాలని ప్రభుత్వాని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రామ్ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు బస్టాండ్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్లు అమ్ముతానని డబ్బులు తీసుకొని..

- తప్పించుకు తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితుడు

నర్సాపూర్: ఓ వెంచర్‌లో ప్లాట్లు అమ్ముతానని డబ్బులు తీసుకుని ప్లాట్లు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..జిన్నారం మండలంలోని చెట్లపోతారం గ్రామ శివారులో వివిఆర్ హౌసింగ్ సొసైటీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి చెందిన వాక వాసుదేవరావు బాచుపల్లి ప్యారడైజ్ డీలక్స్ పేరిట 2012 సంవత్సరంలో వెంచర్ ప్రారంభించారు. ఈ వెంచర్‌లో గజానికి రూ.2,700లు ధర నిర్ణయించగా అప్పట్లో పలువురు డబ్బులు చెల్లించారు. అయినప్పటికీ వారికి అప్పట్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. కొనుగోలు దారులకు రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుక తిరుగుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన జగన్‌మోహన్ రావు రూ.8,59,293లు, మియాపూర్‌కు చెందిన శ్రీనివాస్ రూ.2,39,693లు, కేపీహెచ్‌బికి చెందిన శైలజ రూ.6,52,320లు, అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్ రూ.6,52,232లు వాకా వాసుదేవరావుకు చెల్లించామన్నారు. వారికీ తమ తమ ప్లాట్లు కేటాయించలేదన్నారు. దీంతో వారు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్ఐ పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు విచారణానంతరం నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ తరలించారని పేర్కొన్నారు.

కారుణ్య ఆస్పత్రిపై కొరడా..

- శిశువు మృతిపై విచారణ
- ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో అనుమతుల్లేకుండా ఆసుపత్రుల్లో డెలివరీలు చేయటంపై మంగళవారం జిల్లా వైద్యాధికారులు విచారణ చేపట్టారు. పురిటినొప్పులు వస్తున్న సమయంలో ఓ మహిళకు ఓ ఆసుపత్రి వైద్యులు డెలివరీ చేయటంతో శిశువు మృతి చెందిన ఘటనపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగనిర్మల విచారణ జరిపారు. ఫస్ట్ ఎయిడ్ ఆసుపత్రి వైద్యులు డెలివరీలు చేయటం చట్టరీత్యా నేరమని వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిశువు మృతికి కారణమైన కారుణ్య ఆసుపత్రిని అధికారులు సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం ఆసుపత్రి వైద్యురాలు రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



ఆకాశ్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఏఎస్ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని గుంటూరు జిల్లా, బాపట్ల మండలం నరసాయపాలానికి చెందిన భూషణం బతుకుదెరువు కోసం హైదరాబాద్ జగద్గిరిగుట్టకు వచ్చి భార్య మెర్సీవరదానం ఇద్దరు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. అయితే వీరి కుమారుడు ఆకాశ్(22) డెకరేషన్ వర్క్ చేస్తుంటాడు. ఈ క్రమంలో 21న రాత్రి 10 గంటల సమయంలో ఆకాశ్ తనతో పనిచేసే శ్రావణ్‌లు భోజనం కోసం లింగంపల్లి నుంచి సంగారెడ్డి వైపునకు స్కూటీపై వెళ్లారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి సమీపంలోకి రాగానే ఆకాశ్ బ్రేక్ వేయడంతో ప్రమాదవశాత్తు కింద పడి తీవ్రగాయాలయ్యాయి. వెనుకాల కుర్చున్న శ్రావణ్‌కు ఎడమ చేతికి గాయం కావడంతో వారిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆకాశ్‌కు ప్రథమ చికిత్స అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్డన్ సర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీధర్

మనోహరాబాద్(తూప్రాన్): గౌతోజీగూడెంలో తూప్రాన్ సీఐ శ్రీధర్ మంగళవారం కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా వాడాలన్నారు. మైనర్లు వాహనాలు నడపొద్దన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, అనుమానితులుంటే తమకు సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సురేశ్, సందీప్‌రెడ్డి, మహేందర్, సిబ్బంది, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రేణుకుమార్ పాల్గొన్నారు.

డ్యూటీకని బైక్‌పై వెళ్తూ..

- బస్సు ఢీకొని సూపర్‌వైజర్ మృతి



రమేశ్

మనోహరాబాద్(తూప్రాన్): డ్యూటీకని బైక్‌పై వెళ్తున్న యువకుడిని బస్సు ఢీ కొన్న సంఘటనలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..భద్రాది–కొత్తగూడెం జిల్లా పాల్వంచ పాండురంగాపురం గ్రామానికి చెందిన వింజం రమేశ్(39) కొంపల్లిలో ఉంటున్నాడు. కాగా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని ప్రైమా ఫుడ్‌టెక్ పరిశ్రమలో నాలుగు సంవత్సరాలుగా సూపర్ వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం కొంపల్లి నుంచి తన బైక్‌పై ప్రైమా ఫుడ్‌టెక్‌లో డ్యూటీకని బయలుదేరాడు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామ శివారులోకి రాగానే ఇండియన్ పెట్రోల్ పంపు ఎదురుగా జాతీయ రహదారి–44పై ముప్పిరెడ్డిపల్లి వైపుగా వెళుతున్నాడు. అదే సమయంలో విజయసాయి లాబొరేటరీస్ సంస్థకు చెందిన బస్సు ముందు వెళుతున్న రమేశ్ బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్రగాయాలైన అతణ్ని చికిత్సనిమిత్తం ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

అత్యాచార నిందితుడిపై కేసు

హవేళీఘనపూర్: ఓ బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసినట్లు హవేళీఘనపూర్ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..వడియాం గ్రామానికి చెందిన ఓ యువకుడు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నమ్మించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి అదృశ్యం

నా భర్త ఆచూకీ తెలపండి



జంగయ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జిన్నారం మండలం కాజీపల్లికి చెందిన జంగయ్య, సావిత్రి భార్యాభర్తలు. వారు ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. నాలుగు సంవత్సరాల క్రితం జంగయ్య తన భార్య సావిత్రితో గొడవపడి సుల్తాన్‌పూర్ సమీపంలోని గండిగూడ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం సావిత్రి తన భర్త కోసం వెళ్లి చూడగా స్థానికులు గత పదిహేను రోజులుగా జంగయ్య కనిపించడం లేదని చెప్పారు. దీంతో ఆందోళనకు గురైన సావిత్రి భర్త కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్పర్థలతో భార్య..



శ్వేతరాణి

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో భార్య అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడా గ్రామ సమీపంలోని సృజన లక్ష్మినగర్‌కు చెందిన సురేశ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సురేష్ అతడి భార్య శ్వేతరాణి మధ్య గొడవలతో మనస్పర్థలు పెరిగాయి. ఈ క్రమంలో జూలై 14వ తేదీన ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శ్వేతారాణి వెళ్లిపోయింది. దీంతో శ్వేత కోసం కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురి అదృశ్యంపై తల్లి రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాపూర్‌లో భర్తతో గొడవపడి

పటాన్‌చెరు టౌన్: వివాహిత అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, ఎల్లారెడ్డి మండలం వెంకటాపుర్ గ్రామానికి చెందిన గొలపల్లి శ్రీకాంత్, భార్య లక్ష్మితో బతుకుదెరువు కోసం నాలుగు నెలల క్రితం పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామానికి వచ్చి వాచ్‌మెన్‌గా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు పెరిగాయి. దీంతో లక్ష్మి 23వ తేదీ రాత్రి10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. భార్య కోసం శ్రీకాంత్ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభిండలేదు. దీంతో భార్య అదృశ్యంపై శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాపూర్‌లో వివాహిత



యాదమ్మ

తూప్రాన్: వివాహిత అదృశ్యమైన సంఘటన మల్కాపూర్ గ్రామంలో ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చెల్ మండలం కండ్లకోయ గ్రామానికి చెందిన సామల యాదమ్మ(50) తూప్రాన్ మండలంలోని మల్కాపూర్‌లో ఉంటున్న కూతురు పల్లేపాటి సూజాత ఇంటికి ఈ నెల 19న వచ్చింది. 23న తెల్లవారుజామున కాల కృత్యాలకని ఇంటి నుంచి బయటి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుడు

మునిపల్లి(అందోల్): కంకోల్ వద్ద కారు రెండు బైక్‌లను ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి..బుధేరా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సదాశివపేట మండలంలోని లోపలికోట గ్రామానికి చెందిన దశరథ్ తన భార్య రుక్మిణి, కుమార్తె వైష్ణవితో యాక్టివా బైక్‌పై జహీరాబాద్ నుంచి సదాశివపేట వైపు వెళుతుండగా కంకోల్ టోల్ గేటు వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఇదే క్రమంలో మరో బైక్‌ను ఢీకొట్టడంతో హైదరాబాద్‌కు చెందిన షబ్బీర్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని వైద్యం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెదసాగుతో లాభాలు

దుబ్బాకరూరల్: మండలంలోని గంభీర్‌పూర్, ధర్మాజీపేట, హబ్సీపూర్ గ్రామాల్లో వెదసాగులో సాగుచేస్తున్న పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. వెదజల్లడంతో కూలీల కొరత తప్పుతుందన్నారు. పొలాన్ని తక్కువ శాతం దున్నడంతో ట్రాక్టర్ ఖర్చులు తప్పుతాయని, రసాయనిక ఎరువులు కూడా తక్కువగా పడతాయన్నారు. రైతుబీమాకు సంబంధించి రైతులు తమ నామినీ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు రైతులు సంబంధిత ఏఈఓలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు సురేందర్, మహేశ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ప్రియదర్శినీ

కొండపాక(గజ్వేల్): పంటల సాగు వివరాలు రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శినీ పేర్కొన్నారు. కొండపాక మండలంలో పంటల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిణి మాట్లాడుతూ.. పంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సాగు చేసిన పంటలను పట్టాదార్ పాస్ పుస్తకాలను తీసుకెళ్లి వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో కొనుగోలు కేంద్రాల్లో పంటలను అమ్ముకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. రైతులు పంటలను నమోదు చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ విష్ణు, రైతులు తదితరులు పాల్గొన్నారు.